క్లుప్తంగా

నేటి నుంచి నిరసన దీక్ష

పార్వతీపురం: గిరిజన సమస్యలకు పరిష్కారం కావాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం నుంచి నిరసన దీక్షలు చేపడుతున్నట్లు ఉత్తరాంధ్ర గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గిరిజనులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, గిరిజనుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు నిరసన దీక్షలను కొనసాగిస్తామన్నారు. ఈ నిరసన దీక్షల్లో గిరిజనులు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అత్యాశకు పోయి సైబర్ వలలో పడొద్దు

- రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేసి సైబర్ మోసాలకు గురికా వద్దని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పేర్కొన్నారు. క్యాష్‌బ్యాక్, తక్కువ డబ్బులతో ఎక్కువ రీచార్జ్ ఆఫర్లు అంటూ ఫోన్‌పే పేరిట వస్తున్న లింకులను అత్యాశకు పోయి ఓపెన్ చేసి సైబర్ వలలో పడి మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న ఫిర్యాదులు తమకు వచ్చాయన్నారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చిన లింకులు, సామాజిక మాధ్యమాల్లో ఆఫర్ల పేరిట పోస్టులు పెడుతున్న లింకులు ఓపెన్ చేసి తమ ఖాతాల్లో ఉన్న డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మక్కువ: మండలంలోని గొడేవలస, దబ్బగెడ్డ గ్రామాల్లో శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో వైద్యాధికారులు శకుంతల, ప్రభాకర్ 150 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దబ్బగెడ్డ, గొడేవలస గ్రామాల్లో ఎనీమియా, చికెన్ గున్యా వ్యాధులతో రోగులు బాధపడుతున్నట్లు గుర్తించామని వైద్య అధికారులు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి. నేతాజీనాయుడు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పి.రాజశేఖర్, జోనల్ కన్వీనర్ జి.సత్యనారాయణ, వివిధ సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకంబరిగా పారమ్మతల్లి దర్శనం



శాకంబరిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సాలూరు: ఆషాఢ బహుళ దశమి సందర్భంగా ఆదివారం పాచిపెంట మండలంలోని చీపురువలస సమీపంలో పారమ్మకొండపై వెలసిన పారమ్మ తల్లి శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ఆరాధిస్తారని పండితులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

కొమరాడ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జన్ని గణేష్ అలియాస్ గణప్రసాద్(42) శనివారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. రాత్రి భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురైన ఆయనను 108 అంబులెన్స్ ద్వారా సమాచారం అందించి, పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గిరిజన విద్యపై చిన్నచూపు..!

- అన్ని తరగతులకు ఒకరే గురువు
- కొన్ని చోట్ల బోధించేందుకు ఉపాధ్యాయులు కరువు
- పాఠశాల భవన నిర్మాణాలు పూర్తికాక అవస్థలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యకు దూరమవుతున్న గిరిపుత్రులు

పార్వతీపురంరూరల్/కొమరాడ:

కొండకోనలకు దగ్గరగా నివసిస్తూ కల్మషం లేని వారి జీవన విధానంలో పోడు భూముల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నడిపించే గిరిజనులు నేటికీ మెరుగైన విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదు. అయితే తమ పరిస్థితి ఏవిధంగా ఉన్నా తాము నిత్యం ఏదో ఒక కష్టంతో శతమతమవుతున్నా తమ పరిస్థితులు పిల్లలకు కలగకుండా ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా అయినా పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుదామన్న వారి కల కలగానే మిగిలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి నాడు–నేడులో భాగంగా కోట్ల రూపాయల నిధులు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చింది. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యకోసం, విద్యాలయాల కోసం పైసా కూడా ఖర్చుపెట్టకుండా చోద్యం చూస్తూ విద్యావ్యవస్థను నాశనం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు పక్కా భవనాలు లేక, విద్యార్థులకు బోధించేందుకు గురువులు రాక ప్రధానమైన ప్రాథమిక సమస్యలతోనే గిరిజన ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు దర్శనమిస్తు న్నాయి.

గురువులు రారు..తరగతి గదులు లేవు..

ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తీవ్ర స్థాయిలో సమస్యలు కనిపిస్తున్నాయి. పిల్లలున్న బడికి గురువులు రాక, గురువులున్న బడిలో విద్యార్థులు లేక, విద్యార్థులు, గురువులు ఉన్న బడికి పక్కా భవనాలు లేక మౌలిక సదుపాయాల కల్పనకు నోచుకోక దయనీయ పరిస్థితుల్లో గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలు ఉన్నాయి. కొమరాడ మండలం నయ పంచాయతీ గిరిశిఖర గ్రామమైన దేరుపాడులో గ్రామంలో పది మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఈ పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఆ విద్యార్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొమరాడ మండలం కెమిశిల పంచాయతీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 55మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఒకటే తరగతి గది ఉండడంతో తరగతుల నిర్వహణకు కష్టమవుతోంది. దీంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను చూసి ప్రభుత్వం నుంచి స్పందన కానరాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.50 వేలు సేకరించి తాత్కాలికంగా రేకుల షెడ్డుతో పాఠశాల నిర్మాణం చేశారు. సాలూరు మండలం కె.పెద్దవలసలోనూ ఇదే పరిస్థితి. గత ప్రభుత్వంలో రూ. 37లక్షలు మంజూరు చేసి రూ. 10లక్షల విలువైన పనులు జరిపించి ఇంతలో ప్రభుత్వం మారడంతో ప్రస్తుత ప్రభుత్వం స్పందన లేక 52 మంది ఉన్న విద్యార్థులకు పక్కా భవనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులే స్థానికంగా ఉన్న అడవిలో కర్రలు సేకరించి గడ్డిని కొనుగోలు చేసి పాఠశాలను సిద్ధం చేశారు. ఇలా పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు మండలం బొర్రమామిడి, మెట్టవలస, కొమరాడ మండలం గుమ్మడంగి, పార్వతీపురం మండలం ములక్కాయవలస తదితర గిరిపుత్రుల విద్యాలయాల్లో తీవ్రస్థాయిలో సమస్యలు ఉన్నాయి.



పార్వతీపురం మండలం ములక్కాయ వలసలో 1 నుంచి 4 తరగతుల వరకు ఒకే చోట తరగతుల నిర్వహణ



కొమరాడ మండలం గాజులగూడలో స్వచ్ఛందంగా పాఠశాలకు మరమ్మతులు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)



కొమరాడ మండలం దేరుపాడులో ఉపాధ్యాయుడు లేక తరగతులకు నోచుకోని విద్యార్థులు

వాగ్దానాలు ప్రకటనలకే పరిమితం

గిరిజనుల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి మార్గంలో నడిపిస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు మరింత పెద్దవిగా మారి వేధిస్తున్నాయి. ప్రాథమిక విద్య ప్రతి విద్యార్థికి జీవితంలో బలమైన పునాదిగా ఉండాలి. అయితే విద్యాబోధనతో పాటు మౌలిక సదుపాయాలకు కూడా గిరిజన విద్యార్థులు నోచుకోకపోతే ఏ విధంగా పై తరగతులకు వెళ్లేటప్పుడు చదువులు పూర్తి చేస్తారో అన్న ఆలోచన ప్రశ్నార్థకంగా మారింది.

– కుట్రుక సురేష్, గాజులగూడ, కొమరాడ



సాలూరు మండలం తోణాం పంచాయతీ బొర్రమామిడి వలసలో తడకలతో కట్టి ఉన్న పాఠశాల



మక్కువ మండలం పెద్దవలసలో విద్యార్థుల తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన పాఠశాల

అవస్థలు పడుతున్నా స్పందన కరువు



గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. పక్కా భవనాలు లేక మౌలిక సదుపాయాల కల్పనకు నోచుకోక నేలపైన చదువులు కొనసాగిస్తున్నారు. గురుకులాల్లో సరిపడా ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేరు. ప్రధానంగా జీపీఎస్‌లలో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఆశ్రమ, వసతిగృహాల్లో వైద్య, బోధనేతర సిబ్బంది కూడా లేరు. ప్రధానంగా భవనాలు, వంటశాల, భోజన శాలలు మరమ్మతులకు నోచుకోక గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాడు–నేడు పనులు మధ్యలో నిలిచిపోయి పూర్తికాని పరిస్థితుల్లో దర్శనమిస్తూ కూటమి ఏడాది పాలనలో ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడమే కాకుండా వాటిని పూర్తి చేసే పరిస్థితి కూడా లేదు.

– పాలక రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమసంఘం, పార్వతీపురం

సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వై.మన్మథ రావు

పార్వతీపురం టౌన్: సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రమణారావు, వై మన్మథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో జరిగిన సీఐటీయూ అనుబంధ రంగాల కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 31, జనవరి 1–4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని ఈ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మిక వర్గం హక్కులను హరించేందుకు ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సీఐటీయూ అగ్ర భాగాన నిలిచిందన్నారు. దేశంలోని వివిధ రంగాల కార్మిక సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సీఐటీయూ ఆలిండియా మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముందుగా రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు సెప్టెంబరు 13 ,14వ తేదీలలో పాలకొండలో జరుగుతాయని ఈ జిల్లా మహాసభలను కూడా జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, ఎస్.వై నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.వేణు, శాంతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.ఉమామహేశ్వరి, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలి



నిరసన తెలుపుతున్న నాయకులు తదితరులు

సాలూరు: అద్దెబస్సు డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలని అద్దె బస్సు డ్రైవర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఉన్న ఆర్టీసీ డిపోల పరిధిలో ఉన్న అద్దె బస్సు డ్రైవర్ల జీతాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆదివారం సాలూరులో ఆర్టీసీ డిపో ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ, అద్దె బస్సు డ్రైవర్లకు పల్లె వెలుగుకు రూ.19,500, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు రూ.24 వేలు జీతంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్లు అమలు చేయకపోవడం వల్ల ఏళ్ల తరబడి పాతజీతాలతోనే కార్మికులు కుటుంబ పోషణ చేసుకోవడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికే పార్వతీపురం డిపోలో అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె నోటీసు ఇచ్చి ఆందోళన చేస్తున్నా, యాజమాన్యాలు మొండి వైఖరితో ఉండడం కార్మికులకు అన్యాయం చేయడం అవుతుందని పేర్కొన్నారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని, కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. యూనియన్ నాయకులు శ్రీను, సత్యనారాయణ, హర్ష, సుధీర్ పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించండి



ఎస్టీ బాలుర కళాశాల వసతి గృహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్. సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో గల ఎస్టీ బాలుర కళాశాల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్వతీపురంలోని పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్‌లో పూర్తిగా బాత్‌రూమ్స్ బాగోలేక హాస్టల్ బయటకు వెళ్లాల్సి వస్తోందని, చుట్టుపక్కల ప్రహరీ లేకపోవడం వల్ల విషసర్పాలు కూడా వస్తున్నాయని, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. మొన్న కలెక్టరేట్ ధర్నాలో జిల్లాలో ఉన్న సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చేస్తామని, జాయింట్ కలెక్టర్ చెప్పారన్నారు. కానీ సంబంధిత అధికారులు హాస్టల్స్‌కు వెళ్లి పర్యవేక్షణ చేయడం లేదని, తక్షణమే సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు, జిల్లా అధ్యక్షుడు టి.అఖిల్, టౌన్ కమిటీ సభ్యులు కె.రాజేష్, గణేష్, కృష్ణ, శ్రీను రాహుల్, బొంజెయ్ పాల్గొన్నారు.

పురుగుల అన్నంపై ఎమ్మెల్యే ఆగ్రహం



విద్యార్థులతో కలిసి అన్నం తింటున్న ఎమ్మెల్యే బి.విజయచంద్ర

సీతానగరం: మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అండేద్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం పెట్టడం పట్ల నిర్వాహకులపై ఎమ్మెల్యే బి.విజయచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాలయంలో విద్యార్థులకు పెడుతున్న ఆహారం రుచిగా లేదని, నాణ్యత కొరవడి, అన్నంలో పురుగులు కనిపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్లాంటి ఆహారం మీఇంట్లో అయితే పిల్లకు పెడతారా? అని మండిపడ్డారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం క్రీడా మైదానాన్ని శుద్ధి చేయించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న గ్రీన్‌బెల్ట్ ప్రతినిధులు

సీతానగరం: ఎయిమ్ ఫర్ సేవ ఛాత్రాలయం విద్యార్థులతో ప్రతిఆదివారం గడిపి ఆటపాటలాడుతున్నట్లు గ్రీన్‌బెల్ట్ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు మండలంలోని లచ్చయ్యపేట ఎయిమ్ ఫర్‌సేవా ఛాత్రాలయంలో గ్రీన్ బెల్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాత్రాలయంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం, భోజనాలు గ్రీన్‌బెల్ట్ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు, ఎక్స్ సర్వీస్‌మెన్ రామినాయుడు, కిరణ్‌కుమార్, సన్యాసినాయుడు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పంపిణీ చేశారు. వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.

అరకొర నీటితో దమ్ములు

- కాలువ నీరు విడుదల చేయాలి
- రైతుల విజ్ఞప్తి

సీతానగరం: మండలంలో దమ్ము చేయడానికి సాగునీటి కొరత ఏర్పడడంతో పొడిపొడి దమ్ములు చేస్తూ నాట్లు వేయడానికి అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భూములకు సాగునీరు సరఫరా చేయడానికి వెంగళరాయసాగర్, సీతానగరం(కొత్తవలస)సాగునీటి ప్రాజెక్టులున్నాయి. వెంగళరాయ ప్రాజెక్ట్‌కు నిర్మించిన 19ఎల్, 18 ఎల్ కాలువల నుంచి రామవరం, రెడ్డివానివలస, లచ్చయ్యపేట, గుమ్మిడివరం, అంటిపేట, వెంకటాపురం, కాశీపేట, ఆర్‌వెంకంపేట, వెన్నెలబుచ్చింపేట తదితర గ్రామాలకు చెందిన 8 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. అలాగే సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ పరిధిలో మక్కువ మండలం కంచేడువలస, సీతానగరం మండలం గెడ్డలుప్పి, కొత్తవలస, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం, తామరఖండి, చినబోగిలి, అనంతరాయుడుపేట, పణుకుపేట గ్రామాలకు చెందిన 4 వేల ఎకరాల భూములకు అత్యవసర పరిస్థితుల్లో నీరు విడుదల చేసి పంటలు సాగుకు ఉనియోగించవచ్చు. ఈ నేపథ్యంలో అధికారులు సాగునీరు విడుదల చేయకపోవడంతో బురదతో కూడిన, పంప్‌సెట్‌లున్న వారి నుంచి నీరుసేకరించి అరకొరగా వనరులతో దమ్ములు చేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరున్నా విడుదల చేయకపోవడం వల్ల దమ్ములు చేయడానికి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

కులవృత్తిని కన్నెత్తి చూడని సర్కారు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు మొర



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో కులవృత్తి దారుల వైపు కన్నెత్తి చూడలేదని, కనీసం ఒక్క రూపాయి ఇవ్వలేదని కులవృత్తిదారులు వాపోతూ, గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రజకులు , నాయీబ్రాహ్మణులు, టైలర్లు తదితర కుల వృత్తిదారులకు ఏడాదికి రూ.10 వేలు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు పట్టణంలోని 14,15 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరిగిన రాజన్నదొరకు అడుగడుగునా పెద్ద ఎత్తున స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి , పూలదండలు వేసి తమ అభిమానం చాటుకున్నారు. బాణసంచా కాల్చుతూ అభిమానులు సందడి చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని అన్ని వర్గాల ప్రజలు వాపోతూ తమ సమస్యలను రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు. తల్లికి వందనం డబ్బులు రాలేదని, వితంతువులకు పింఛన్లు రావడం లేదని, దివ్యాంగులకు కొత్త పింఛన్లు రాలేదని, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, రేషన్ కోసం గంటల పాటు డిపో వద్ద వేచి ఉండాల్సివస్తుందని ఏకరువు పెట్టారు.

ఆడబిడ్డ నిధి అడ్రస్సే లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారని , అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా డబ్బులివ్వలేదని మహిళలు వాపోయారు. కూటమి ఏడాదిపాలనలో ఆడబిడ్డ నిధి అడ్రస్సే లేకుండా పోయిందన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైఎస్సార్‌చేయూత కింద మహిళలకు ఏడాదికి రూ.18,750, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తమను మోసం చేసిందని మహిళలు వాపోయారు. అనంతరం కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మీకు ఈ పాంప్లెట్‌ల ద్వారా ఇస్తున్నామని, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా అవి వస్తాయని ఆ హామీలను అమలు చేయాలని కూటమి నేతలను నిలదీయాలని సూచించారు.

జగన్, చంద్రబాబుల పాలనలో తేడాను గుర్తించండి

గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలను తొలి ఏడాదిలోనే అమలుచేశారని, నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని రాజన్నదొర వివరించారు. జగన్ పాలనకు,చంద్రబాబు పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, రాంబాయి, లక్ష్మణ, వెంకటనాయుడు, ఎంఎస్‌నారాయణ, గొర్లె మధుసూదనరావు, కాకి పాండురంగారావు, గొర్లె వెంకటరమణ, గులిపల్లి నాగేశ్వరరావు, బాలకృష్ణ, కొల్లి వెంకటరమణ, పిరిడి రామకృష్ణ, మజ్జి అప్పారావు, పిట్టా వాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పూర్తి స్థాయిలో అందించాలి



మాట్లాడుతున్న కొల్లి గంగునాయుడు

పార్వతీపురం టౌన్: జిల్లాలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య భావనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత చాలా తీవ్రంగా ఉందని రైతులు పొలాల్లో పనులు మానుకుని మండలాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిలో ఉన్నారన్నారు. వ్యవసాయ అధికారులు నాట్లు వేసిన వారం రోజుల్లోపు యూరియా అందించాలని సలహాలు ఇస్తారన్నారు. జిల్లాలో 15 రోజులుగా నాట్లు జరుగుతున్నాయని విస్తారంగా వర్షాలు పడుతున్నాయని కానీ రైతులకు యూరియా మిగతా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయవలసి వస్తోందని, సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా సచివాలయాల వద్ద ఎరువులన్నీ అందించే వారిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి రైతులకు సరిపడా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వై నాయుడు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

సీతానగరం: మండలంలోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర ఆదివారం వాలీబా ల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వ్యాయామ విద్య ను అలవర్చుకోవాలన్నారు. వ్యాయామ విద్య వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతంగా విద్యార్థులు తయారై విజ్ఞాన వంతులవుతా రన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాల యం ఉపాధ్యాయులు బి.లక్ష్మణరావు, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.